GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 2PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 84 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 26 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# మంత్రి లోకేశ్ కు శాన్ఫ్రాన్సిస్కోలో అపూర్వ స్వాగతం

**ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తెచ్చేందుకు అమెరికా వెళ్లిన మంత్రి నారా లోకేశ్ కు శాన్ఫ్రాన్సిస్కోలో అపూర్వ స్వాగతం లభించింది.**



అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్): పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ కు అక్కడి తెలుగు ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు ఘన స్వాగతం పలికారు. "ప్రపంచ ఐటీ రంగంలో తెలుగువారు ఓ వెలుగు వెలుగుతున్నారంటే అందుకు తెదేపా జాతీయాధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు ముందుచూపు వల్లనే. భారత దేశ ఐటీ రంగంలో హైదరాబాద్ హైటెక్ సిటీ పేరు చెప్పగానే చంద్రబాబు గుర్తుకు రాక మానరు. 2000 సంవత్సరంలోనే విజన్ 2020 అంటూ ఐటీ రంగం సాధించబోయే అభివృద్ధిని అంచనా వేసిన విజనరీ లీడర్ చంద్రబాబు. ఆ క్రమంలోనే తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న మంత్రి లోకేశ్ 2047 నాటికి వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ సాధనకు అహర్నిశలు శ్రమిస్తున్నారు" అని ఎన్నారై ప్రముఖులు కొనియాడుతున్నారు.తన తండ్రి రాజకీయ వారసత్వంతో పాటు ఐటీ రంగంపై చంద్రబాబుకు ఉన్న ప్రత్యేక శ్రద్ధను కూడా లోకేశ్ పుణికి పుచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగా ఆయన నేటి నుంచి అమెరికాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా శాన్ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో లోకేశ్కు ఘన స్వాగతం పలికేందుకు తెదేపా ఎన్నారై నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఏపీలో ఎన్డీఏ కూటమి 'అఖండ' విజయం సాధించిన తర్వాత తొలిసారిగా లోకేశ్ అమెరికాలో పర్యటిస్తున్నారు. తెదేపా ఘన విజయం సాధించడంతో పార్టీ ఎన్నారై నేతలు, కార్యకర్తలు ఫుల్ జోష్లో ఉన్నారు. మంగళగిరి ఎన్నికల్లో ఆల్ టైం రికార్డు బద్దలు కొట్టి తిరుగులేని విజయం సాధించి మంత్రి అయిన లోకేశ్కు ఘన స్వాగతం పలికారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఎన్నారై తెదేపా యూఎస్ఏ కో ఆర్డినేటర్ జయరాం కోమటి, ఎన్నారై తెదేపా మీడియా కో ఆర్డినేటర్ సాగర్ దొడ్డపనేని, స్థానిక తెదేపా నేతలు శశి దొప్పలపూడి, శ్రీకాంత్ దొడ్డపనేని, తెదేపా జోనల్ ఇన్చార్జి రవి మందలపు, ఐటి సర్వ్ ప్రతినిధులు వినోద్ ఉప్పు, సతీశ్ మండువ, సురేశ్ మానుకొండ తదితరులు ఉన్నారు.అక్టోబర్ 25 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటిస్తారు. ఈనెల 29న లాస్వేగాస్ నగరంలో జరగనున్న ఐటీ సర్వ్ సినర్జీ 9వ సదస్సుకు హాజరుకానున్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేలా పలు ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. అట్లాంటాలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా నిర్వహించే సభకు ఎన్నారై తెదేపా నేతలు, అభిమానులు, ఎన్నారైలు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు.

# రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ: చంద్రబాబు



**అనేక మంది నాయకులను తయారు చేసిన పార్టీ తెదేపా అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.**

మంగళగిరి, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్): అనేక మంది నాయకులను తయారు చేసిన పార్టీ తెదేపా అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళగిరిలో ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. "రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ. నేటి తరం చాలా మంది తెలుగు రాజకీయ నాయకుల మూలాలు తెదేపాలోనే ఉన్నాయి. రాజకీయ కార్యకర్తల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కార్యకర్తలను నాయకులుగా తయారు చేసేందుకు అనునిత్యం పనిచేస్తున్నాం. వారి సంక్షేమం కోసం ముందుకెళ్లాం. రాజకీయ కక్షలకు బలైన సంఘటనలు చాలా చూశాం. అనేక కారణాలతో కార్యకర్తలు చనిపోయారు. వారి కుటుంబాలను ఆదుకుంటున్నాం" "తెదేపా పనైపోయిందన్న వాళ్ల పనైపోయింది. పార్టీయే శాశ్వతం. తెదేపాకు ముందు.. ఆ తర్వాత అన్నట్లు తెలుగుజాతికి గుర్తింపు వచ్చింది. కార్యకర్తల మనోభావాలు గౌరవించే పార్టీ తెదేపా. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ప్రమాద బీమా పెట్టిన పార్టీ ఇది. జాతీయ స్థాయిలో తెదేపా పోషించిన కీలకపాత్రలు మరే పార్టీకి సాధ్యం కాలేదు" "నేను 1995 సీఎంనే కానీ.. 2014 సీఎంను కాదు. ఈ సారి కచ్చితంగా రాజకీయ పరిపాలనే చేస్తా. రాజకీయ ముసుగులో తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. క్యాడర్ నుంచి వస్తున్న విమర్శలను అర్థం చేసుకోగలను. రాష్ట్రంలో ఎక్కడ ఇసుక దందా జరిగినా తిరుగుబాటు చేయండి, నేను అండగా ఉంటా. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం" అని చంద్రబాబు అన్నారు.

## రేపటి నుంచి విశాఖ-విజయవాడ మధ్య మరో రెండు విమాన సర్వీసులు

**విశాఖపట్నం నుంచి విజయవాడకు మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.**



విశాఖ, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్): విశాఖపట్నం నుంచి విజయవాడకు మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఆదివారం నుంచి ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్ సంస్థలు ఈ సర్వీసులను నడపనున్నాయి. వీటిని కేంద్ర పౌర విమానయానశాఖమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించనున్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం సాయంత్రం 7.15 గంటలకు బయలుదేరి రాత్రి 8.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. అక్కడ విమానం తిరిగి 8.45 గంటలకు బయలుదేరి రాత్రి 9.50 గంటలకు విజయవాడ వస్తుందని అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్ సర్వీస్ ఉదయం 9.35 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి 10.35 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి రాత్రి 7.55 గంటలకు బయలుదేరి 9 గంటలకు విశాఖపట్నం వెళ్తుంది. ఈ సర్వీస్ల రాకతో విజయవాడ-విశాఖ విమాన సర్వీస్ల సంఖ్య మూడుకు చేరనుంది.

## 11 ఏళ్ల తర్వాత 19వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు : మంత్రి పొన్నం

**తెలంగాణలోని మోడల్ పాఠశాలల్లో 11 ఏళ్ల తర్వాత 19 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 35 వేల మందికి బదిలీలు చేపట్టామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**



కరీంనగర్, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్): తెలంగాణలోని మోడల్ పాఠశాలల్లో 11 ఏళ్ల తర్వాత 19 వేల మంది ఉపాధ్యాయులకుపదోన్నతులు, 35 వేల మందికి బదిలీలు చేపట్టామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్లో కలెక్టర్ పమేల సత్పతితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై విద్యార్థుల రోల్ ప్లేను అధికారులతో కలిసి మంత్రి పొన్నం వీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాలో 23,000 మంది విద్యార్థులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద షూస్ పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 25వేల పాఠశాలల్లో రూ.11 వేల కోట్లతో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. శానిటైజేషన్ సిబ్బంది కోసం నిధులు, ఉచిత విద్యుత్, తాగునీటితోపాటు అన్ని గురుకులాలకు అద్దెలు చెల్లించామన్నారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 14 భాషల్లో మాట్లాడేవారని గుర్తు చేశారు. విద్యార్థులు కూడా ఇంగ్లీష్, హిందీ ఇతర భాషలు నేర్చుకొని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# రేవంత్ కంటే చంద్రబాబు చాలా నయం..: మందకృష్ణ మాదిగ

**చేయూత పింఛన్దారులందరినీ వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్పీఎస్) ఏకీకృతం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు.**



హైదరాబాద్, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్): చేయూత పింఛన్దారులందరినీ వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్పీఎస్) ఏకీకృతం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. చేయూత పింఛన్ తీసుకునే వారిని రేవంత్ ప్రభుత్వం నట్టేట ముంచిందని విమర్శించారు. వీరితో కలిసి బలమైన ఉద్యమం చేపడతామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నమ్మిన పింఛన్దారులు కాంగ్రెస్ను గెలిపించారని చెప్పారు. 10 నెలలు అయినా.. ఎందుకు పెంచి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. "ఏపీలో ఏప్రిల్ నెలలో మేం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చాం. దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని కోరాం. ఆయన జూన్లో అధికారంలోకి రాగానే ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలవి ఇచ్చారు. ఏపీలో కండరాల క్షీణత ఉన్నవాళ్లకు రూ.15 వేల పింఛన్లు ఇస్తున్నారు. రేవంత్ కంటే చంద్రబాబు చాలా నయం. తెలంగాణలో వచ్చే నెల మొదటి వారంలో గడిచిన 10 నెలల బకాయిలతో పాటు నవంబర్ పింఛన్ ఇవ్వాలి. లేదంటే ఉద్యమం తప్పదు. నవంబర్ 1 నుంచి 16 వరకు ప్రతిరోజు రెండు జిల్లాల్లో చేయూత పింఛన్ లబ్దిదారులకు చైతన్య సభలు నిర్వహిస్తాం. అప్పటికీ ఇవ్వకుంటే నవంబర్ 26న చలో హైదరాబాద్కు పిలుపునిస్తాం 26న వికలాంగుల మహా గర్జన పేరిట వేలాది మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపడతాం. కాంగ్రెసేతర అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తాం. రేవంత్ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటాం" అని మందకృష్ణ అన్నారు.

## నందిగం సురేష్, బోరుగడ్డ అనిల్పై హత్యాయత్నం కేసు

**వైకాపా నేత నందిగం సురేష్, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్పై తుళ్లూరు పోలీసు స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదైంది.**



అమరావతి, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్): వైకాపా నేత నందిగం సురేష్, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్పై తుళ్లూరు పోలీసు స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదైంది. భాజపా నేత, ప్రస్తుత మంత్రి సత్యకుమార్పై దాడి ఘటనలో వారిపై ఈ కేసు నమోదైంది. ఇందులో ఏ1గా సురేష్, ఏ2గా బోరుగడ్డ అనిల్ను చేర్చారు. మూడు రాజధానుల శిబిరం వద్ద 2023లో సత్యకుమార్పై దాడి జరిగింది. రాజధాని రైతులకు సంఘీభావం తెలిపి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. సత్యకుమార్పై దాడికి సంబంధించి భాజపా నేతలు 25 మందిపై ఫిర్యాదు చేశారు.

## నరసారావుపేటలో కలకలం రేపుతున్న శిశు విక్రయాలు

**పల్నాడు జిల్లా నరసారావుపేటలో శిశు విక్రయాలు కలకలం రేపుతున్నాయి. నరసారావుపేటలో తొమ్మిది నెలల క్రితం ఓ ఆడశిశువును విక్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.**



నరసారావుపేట, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్): పల్నాడు జిల్లా నరసారావుపేటలో శిశువుల విక్రయం కలకలం రేపింది. నరసారావుపేటలో తొమ్మిది నెలల క్రితం ఓ ఆడశిశువును విక్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, ఐడీడీఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక నిమ్మతోటకు చెందిన ఓ మహిళకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. ఆమె నాలుగో సారి గర్భం దాల్చిన సమయంలో పిల్లలను పోషించలేనని.. ఓ ఆసుపత్రిలో పనిచేసే ఆయా సాయంతో విజయవాడకు చెందిన ఓ ఆటో డ్రైవర్కు రూ. లక్షకు కుమార్తెను విక్రయించింది. మధ్యవర్తిగా ఉన్న ఆయా కమీషన్గా రూ.20 వేలు తీసుకున్నట్టు సమాచారం.ఈ వ్యవహారంపై గుర్తు తెలియని వ్యక్తి ఆకాశ రామన్నపేరుతో ఇటీవల జిల్లా కలెక్టర్కు లేఖ రాశారు. దీనిపై దర్యాప్తు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లేఖ ఆధారంగా మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుభాషిణి శుక్రవారం విచారణ చేపట్టారు. నరసారావుపేట నిమ్మతోట ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు కొన్నేళ్లుగా శిశువులను విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇందులో ఓ మహిళ చౌక దుకాణం నిర్వాహకురాలు కావడం గమనార్హం. శిశువుల విక్రయంలో వీరి పాత్రపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. అలాగే, వినుకొండకు చెందిన ఓ మహిళ నుంచి కూడా కొన్నిరోజుల క్రితం కొనుగోలు చేసిన మగశిశువును ఆసుపత్రి నర్సు ఒకరు పెంచుకుంటున్నట్లు సమాచారం. దీనిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని, ప్రాథమిక సమాచారం ఆధారంగా విచారణ చేస్తున్నామని సీఐ సుభాషిణి వెల్లడించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmail.com


# పవన్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం .. సరస్వతి పవర్ భూముల్లో అధికారుల సర్వే

**సరస్వతి పవర్ సంస్థ భూముల వ్యవహారంపై డిప్యూటీ సీఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం కదిలింది.**



**అమరావతి, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** సరస్వతి పవర్ సంస్థ భూముల వ్యవహారంపై డిప్యూటీ సీఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం కదిలింది. 'పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లో సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో అటవీశాఖ భూములు ఏమైనా ఉన్నాయా? ఉంటే వాటి విస్తీర్ణం ఎంత ఉందో పేర్కొంటూ నివేదిక ఇవ్వాలి' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అటవీ పర్యావరణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో దాచేపల్లి డీఆర్వో ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది శనివారం దాచేపల్లి, మాచవరం మండలాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. సరస్వతి పవర్ సంస్థకు ఉన్న 1,515.93 ఎకరాల్లో ప్రకృతి సంపద, వాగులు, వంకలు, కొండ భూములు ఉన్నాయనే సమాచారం వెలుగుచూసిన నేపథ్యంలో పవన్‌కల్యాణ్ అధికార యంత్రాంగంతో మాట్లాడారు. ఆ సంస్థకు చెందిన భూముల్లో జలవనరులు, ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయో తెలియజేయడంతో పాటు అటవీ భూముల అంశాన్ని సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. వాగులు, వంకలు, కొండలు ఆ భూముల్లో ఉన్నందున పర్యావరణ అనుమతులు ఎలా పొందారో తెలియజేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులనూ ఉపముఖ్యమంత్రి కోరారు.

# పోటీ కొత్తేమో.. పోరాటం కొత్త కాదు : ప్రియాంకగాంధీ వాద్రా



**కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వయనాడ్ ప్రజలను ఉద్దేశించి సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.**

**అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి అరంగేట్రం చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వయనాడ్ ఉప ఎన్నిక పోరుకు సిద్ధమవుతున్నారు. ఇటీవలే ఈ లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈనేపథ్యంలో తాజాగా వయనాడ్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఓ భావోద్వేగభరిత పోస్ట్ చేశారు. ఎన్నికల్లో పోటీ కొత్తేమో గానీ.. ప్రజల తరపున పోరాటం తనకు కొత్తేమీ కాదని అన్నారు. "కొన్ని నెలల క్రితం నేను, మా సోదరుడు రాహుల్తో కలిసి మండక్కై, చూరాల్మల వెళ్లాను. కొండచరియలు విరిగిపడటంతో ప్రకృతి సృష్టించిన బీభత్సం కారణంగా మీరు ఎదుర్కొన్న నష్టాన్ని, సర్వం కోల్పోయిన మీ ఆవేదనను కళ్లారా చూశా. పిల్లలను కోల్పోయిన తల్లులు, కుటుంబాన్ని కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను చూశా. ఆ చీకటి రోజుల నుంచి బయటపడి నవశక్తితో మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయకం. నిస్సహాయ స్థితిలోనూ తోటి వారి కోసం మీరు పడిన ఆరాటం.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఆ విషాద సమయంలో మీరు చూపించిన అచంచలమైన ధైర్య సాహసాలే.. ఈరోజు నాలో స్ఫూర్తిని నింపాయి. మీ తరపున పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాష "నా సోదరుడికి మీరు ఎంతో ప్రేమను, అభిమానాన్ని పంచారు. అదే ప్రేమను నాపైనా కురిపిస్తారని ఆశిస్తున్నా. చట్టసభలో మీ గళాన్ని వినిపించే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నా. చిన్నారుల భావి భవిష్యత్తు, మహిళల శ్రేయస్సు కోసం నా శక్తికి మించి కృషి చేస్తానని మాటిస్తున్నా. ప్రజాప్రతినిధిగా పోటీ చేసే ఈ ప్రయాణం నాకు కొత్త కావొచ్చు. కానీ, ప్రజల తరపున గళం వినిపించేందుకు చేసే పోరాటం మాత్రం కొత్త కాదు. ఈ ప్రయాణంలో మీరంతా నాకు మార్గదర్శకంగా నిలుస్తారని ఆశిస్తున్నా" అని ప్రియాంకా గాంధీ రాసుకొచ్చారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్గాంధీ.. సీపీఐ నాయకురాలు అన్నీరాజాపై 3.6 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాహుల్ రాజీనామాతో జరుగుతోన్న ఉప ఎన్నికలో ప్రియాంకాగాంధీ కాంగ్రెస్ తరపున పోటీకి దిగారు. కేరళలో పాలక్కాడ్, చెలక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నవంబర్ 13న జరగనుంది. నవంబర్ 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

# 'ప్రిన్సిపల్తో పాటు నాన్న కూడా కొట్టాడు' .. తీవ్ర మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

**తీవ్ర మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.**

**ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో చోటుచేసుకుంది.**



**గజ్వేల్, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** కాపీ కొట్టావంటూ ప్రిన్సిపల్ కొట్టడంతోపాటు తండ్రికి చెప్పగా.. అతను వచ్చి తోటి విద్యార్థుల ముందు తనను కొట్టాడని భరించలేని ఓ విద్యార్థి తీవ్ర మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శబాష్ గూడెం గ్రామానికి చెందిన 13 ఏళ్ల విద్యార్థి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలలో జరిగిన ఓ పరీక్షలో కాపీ కొడుతున్న విద్యార్థిని గమనించి అతన్ని కొట్టడంతోపాటు తండ్రికి ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ విద్యార్థి తండ్రి పాఠశాలకు వచ్చి తోటి విద్యార్థుల ఎదుట కొట్టాడు. ప్రిన్సిపల్తో పాటు తండ్రి కూడా చేయిచేసుకోవడాన్ని జీర్ణించుకోలేని ఆ విద్యార్థి.. శనివారం ఉదయం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద ఉన్న చెట్టువద్దకు వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కొమురవెల్లి ఎస్సై రాజు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆందోళన.. చర్యలు తీసుకుంటామన్న తెలంగాణ డీజీపీ

**బెటాలియన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళనపై తెలంగాణ డీజీపీ జితేందర్ స్పందించారు.**



**హైదరాబాద్, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** బెటాలియన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళనపై తెలంగాణ డీజీపీ జితేందర్ స్పందించారు. క్రమశిక్షణతో కూడిన ఫోర్స్లో ఉంటూ ఆందోళనలు చేయడం సరికాదన్నారు. ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ జితేందర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సెలవులపై పాత పద్ధతే అమలు చేస్తామని చెప్పినప్పటికీ మళ్లీ ఆందోళనలకు దిగడం సరికాదన్నారు. ఆందోళనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తులు ఉన్నాయనే అనుమానం ఉందన్నారు. ఆందోళనలు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మన దగ్గర ఉన్న రిక్రూట్మెంట్ వ్యవస్థను అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని ప్రకటనలో పేర్కొన్నారు

# సీఎం రేవంత్రెడ్డి దుర్బుద్ధి.. ఆరునెలల్లోనే బయటపడింది : ఎంపీ ఈటల

**సీఎం రేవంత్ రెడ్డి మూసీ బ్యూటిఫికేషన్ చేస్తాననేది కేవలం డబ్బు సంచులు నింపుకోవడానికేనని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు.**



**హైదరాబాద్, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి మూసీ బ్యూటిఫికేషన్ చేస్తాననేది కేవలం డబ్బు సంచులు నింపుకోవడానికేనని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇప్పటివరకు నిర్మించిన మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ) లను ప్రారంభించే తెలివి సీఎంకు లేదని దుయ్యబట్టారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని టీకేఆర్ కాలనీలో మూసీ పరివాహక ప్రాంతాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కలిసి పరిశీలించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న ఈటల.. ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రా, మూసీ పేరుతో కొత్త నాటకాలకు తెర లేపారన్నారు. పేదలకు అన్యాయం చేసి పెట్టుబడిదారులకు వత్తాసు పలకడం సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిజస్వరూపం తెలిసేందుకు ఆరేళ్లు పడితే.., రేవంత్ దుర్బుద్ధి ఆరు నెలల్లోనే బయటపడిందన్నారు. ఇష్టారీతిన వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలనకు మంచి రోజులు ముగిశాయన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదన్నారు. మూసీలో విషపదార్థాలు, రసాయనాలు చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆర్థిక వ్యవస్థను జగన్ చిన్నాభిన్నం చేసినా.. చంద్రబాబు హామీలు అమలు చేస్తున్నారు: నిమ్మల

**తూర్పు గోదావరి జిల్లాలో ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు రెండో రోజు పర్యటిస్తున్నారు.**



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** తూర్పు గోదావరి జిల్లాలో ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు రెండో రోజు పర్యటిస్తున్నారు. స్థానిక శుభమస్తు కల్యాణ మండపంలో తెలుగుదేశం, జనసేన, భాజపా జిల్లా నాయకులతో ఆయన సమావేశమయ్యారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ, సాగునీటి సంఘాలు, సహకార సంఘాల ఎన్నికలపై సమీక్ష చేపట్టారు. కూటమి నేతలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. "రూ.14 లక్షల కోట్ల అప్పు రాష్ట్రం మీద ఉన్న స్థితిలో కూడా పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, డీఎస్సీ నోటిఫికేషన్, రైతులకు 25 వేల ఇన్పుట్ సబ్సిడీ పెంపు వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. గత ఐదేళ్ల జగన్ సర్కార్ పాపాలు ప్రజలపై భారం రూపంలో వెంటాడుతున్నాయి. నాటి ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్ల రేట్లు దాచిపెట్టి, వెబ్సైట్లను డమ్మీ చేసి, చీకటి జీవోలు ఇచ్చి ప్రజలపై భారం మోపింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను జగన్ చిన్నాభిన్నం చేసినా.. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారు" అని మంత్రి నిమ్మల తెలిపారు.

# న్యూడ్ కాల్ చేసి.. డబ్బులు అడిగి.. పెట్రేగిపోతున్న సైబర్ నేరగాళ్లు!

**జనగామ కలెక్టరేట్లోని ఓ శాఖకు చెందిన అధికారికి ఓ యువతి సెల్ ఫోన్లో వీడియో కాల్ చేసి న్యూడ్గా మారి, తర్వాత అధికారిని సైబర్ నేరస్థులు డబ్బులు డిమాండ్ చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది.**



**జనగామ టౌన్, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** సామాన్య ప్రజలే కాకుండా కీలకమైన హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధుల నుంచి మొదలుకొని ఉన్నతాధికారుల వరకు సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. తాజాగా జనగామ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్లోని ఓ శాఖకు చెందిన అధికారికి ఓ యువతి సెల్ ఫోన్లో వీడియో కాల్ చేసి న్యూడ్గా మారి, తర్వాత అధికారిని సైబర్ నేరస్థులు డబ్బులు డిమాండ్ చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వీడియో కాల్ చేసి న్యూడ్గా మారిపోతుండటంతో కంగారుపడిన అధికారి ఫోన్ కట్ చేశారు. ఇంతలోనే మాట్లాడిన వీడియో రికార్డును, యూట్యూబ్లో అప్ లోడ్ చేశామని తొలగించాలంటే ముందుగా రూ.35 వేలు పంపాలని కోరాడు. మరో అపరిచిత వ్యక్తి తాను సైబర్ క్రైమ్ అధి కారిగా చెపుతూ వరుసగా అధికారిని భయపెట్టారు. పక్కనే ఉన్న ఇతర కార్యాలయ సిబ్బంది అనుమానం వచ్చి ఆయనను వారించడంతో ఫోన్ పెట్టేశాడు. ఈ విషయంపై సదరు అధికారి స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# నా బిడ్డలపై ప్రమాణం చేస్తా.. జగన్, సుబ్బారెడ్డి చేస్తారా?: వైఎస్ షర్మిల

**వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు.**



**విజయవాడ, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సుబ్బారెడ్డి వ్యాఖ్యపై స్పందించారు. "జగన్ పదవులు ఇస్తే సుబ్బారెడ్డి అనుభవిస్తున్నారు.. ఆయన అలా మాట్లాడకపోతే ఎలా మాట్లాడుతారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు ఆర్థికంగా లాభపడ్డారు. సుబ్బారెడ్డే కాదు.. సాయిరెడ్డి కూడా అలాగే మాట్లాడొచ్చు. ఎందుకంటే ఆయన కూడా వాళ్ల టీమ్లోనే ఉన్నారు. జగన్ పక్కన వాళ్లు ఉన్నారని తెలిసి కూడా నిన్న రాసిన లేఖలో వాళ్ల పేర్లు ప్రస్తావించాను. నేను చెబుతున్నది నిజమని ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి చెబుతున్నది కూడా నిజమని ఆయన ప్రమాణం చేయగలరా? రాజశేఖర్రెడ్డి కుమార్తె తన బిడ్డలమీద ప్రమాణం చేసి చెబుతోంది. నలుగురు మనవళ్లకు ఆస్తిలో సమాన వాటా అని రాజశేఖర్రెడ్డి బ్రతికుండా చెప్పారు. ఇది నిజం కాదని.. సుబ్బారెడ్డి, జగన్ ఇద్దరూ తన బిడ్డలపై ప్రమాణం చేసి చెప్పగలరా? కంపెనీలకు భారతి, జగతి అని వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. ఆరోజు ఆ పేర్లు పెట్టుకోగలిగారంటే కారణం.. రాజశేఖర్రెడ్డి అనుమతించారు. పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఆస్తులు మొత్తం వారివే అనే రూల్ ఏమైనా ఉందా? ఆస్తులు మొత్తం జగన్వే కాబట్టి ఆయన జైలుకు వెళ్లారని సుబ్బారెడ్డి చెబుతున్నారు. భారతి పేరుపై ఆస్తులు ఉంటే ఆమె ఎందుకు జైలుకు వెళ్లలేదు? ఎవరైనా గిఫ్ట్ ఇస్తే ఎంవోయూ రాసుకుంటారా? మీరు ఎంవోయూ రాశారంటేనే ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అర్థం. దీనికి సుబ్బారెడ్డి సమాధానం చెప్పాలి. కన్నతల్లిపై కేసు వేసిన వ్యక్తి ఈ లోకంలో ఎవరైనా ఉన్నారా? అందరి ఇళ్లలో ఉండే విషయాలే అని సునాయాసంగా మాట్లాడుతున్నారు. మీకు మానవత్వం లేదా? ఎవరో మాట్లాడితే బాధపడితే మాట్లాడేదాన్ని కాదు.. సుబ్బారెడ్డి బాబాయి మాట్లాడే వరకు చాలా బాధపడ్డా. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆయన అలా మాట్లాడి ఉండాల్సింది కాదు" అని ఆవేదన వ్యక్తం చేశారు.